# కరుణ్ 2.0

**'డియర్ క్రికెట్. గివ్ మీ వన్ మోర్ చాన్స్'.. 2022, డిసెంబర్ 10న కరుణ్ నాయర్ చేసిన ట్వీట్ ఇది. కట్‌చేస్తే.. మూడేండ్ల తర్వాత ఆదివారం ముంబై ఇండియన్స్‌తో ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో అతడు సృష్టించిన కళాత్మక విధ్వంసం అనంతరం 'ఎక్స్'లో మరోమారు ఈ ట్వీట్ ట్రెండింగ్‌లోకి వచ్చింది. దేశ టెస్టు క్రికెట్ చరిత్రలో వీరేంద్ర సెహ్వాగ్ తర్వాత రెండో త్రిశతకం సాధించినా.. జాతీయ జట్టులో మళ్లీ ఎందుకు చోటు దక్కలేదో ఇప్పటికీ అంతుచిక్కని ప్రశ్నగా మారిన కరుణ్‌కు ఇది ముమ్మాటికీ కమ్‌బ్యాక్ ఇన్నింగ్సే..**

*నమస్తే తెలంగాణ క్రీడా విభాగం*



ట్రెంట్ బౌల్ట్, జస్‌ప్రీత్ బుమ్రా.. ఆధునిక క్రికెట్‌లో ఈ ఇద్దరి బౌలింగ్ సామర్థ్యం, వారు సాధించిన ఘనతపై ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. కానీ ఆదివారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కరుణ్ నాయర్ సృష్టించిన విధ్వంసం తర్వాత 'వీళ్ల బౌలింగ్‌లో ఆడటం ఇంత తేలికా!' అన్న భావన కలగక మానదు. ముంబై నిర్దేశించిన 206 పరుగుల ఛేదనలో స్కోరుబోర్డుపై పరుగులేమీ చేరకుండానే వికెట్ పడిపోయినా 'ఇంప్యాక్ట్ ప్లేయర్'గా వచ్చిన కరుణ్.. ఆ పదానికి అసలైన నిర్వచనం ఇచ్చాడు. దిగ్గజ బ్యాటర్లు సైతం భారీ షాట్లు ఆడేందుకు ఒకటికి రెండు సార్లు ఆలోచించే బుమ్రా బౌలింగ్‌లో 9 బంతులను ఎదుర్కొన్న కరుణ్.. 3 బౌండరీలు, రెండు భారీ సిక్సర్లతో 26 పరుగులు రాబట్టాడు. ముఖ్యంగా బుమ్రా ఆరో ఓవర్లో డీప్ బ్యాక్‌వర్డ్ స్క్వేర్, లాంగాఫ్ మీదుగా బాదిన సిక్సర్లు అయితే చూసి తీరాల్సిందే. కరుణ్ క్రీజులో ఉన్నంతసేపు హార్దిక్ మళ్లీ బుమ్రాకు బంతినివ్వలేదంటే కరుణ్ ఆట ఏ రేంజ్‌లో సాగిందో అర్థం చేసుకోవచ్చు. మ్యాచ్ ఫలితం గురించి పక్కనబెడితే.. ఢిల్లీ ఇన్నింగ్స్‌పై అతడు చూపిన ప్రభావం కొన్నేండ్లపాటు గుర్తుంచుకోదగినదే. టెస్ట్ ప్లేయర్‌గా ముద్రపడ్డ నాయర్.. 22 బంతుల్లోనే అర్ధ శతకం పూర్తిచేయడం విశేషం. తన పునరాగమనాన్ని ఘనంగా చాటిన కరుణ్‌కు క్రికెట్‌లో ఇది రెండో అవకాశం వంటిదే. 2022లో అతడు అభ్యర్థించినట్టే క్రికెట్ అతడికి మరో చాన్స్ ఇచ్చింది.

### త్రిశతకం బాదినా..

టెస్టు క్రికెట్‌లో అతి కొద్దిమందికి మాత్రమే సాధ్యమయ్యే ట్రిపుల్ సెంచరీ కలను ఆడిన మూడో టెస్టులోనే నెరవేర్చుకున్న కరుణ్ నాయర్ జాతీయ జట్టుకు దూరమై ఎనిమిదేండ్లు దాటింది. 2016లో మొహాలీ టెస్టులో అరంగేట్రం చేసిన అతడు.. అదే సిరీస్‌లో భాగంగా చెన్నైలో త్రిశతకం బాదాడు. కానీ ఆరు నెలలు కూడా తిరగకముందే జట్టుకు దూరమయ్యాడు. దేశవాళీలో టన్నుల కొద్దీ పరుగులు చేసినా రాష్ట్ర స్థాయి జట్టు (కర్నాటక) కూడా పొమ్మనకుండా పొగబెట్టింది. ఐపీఎల్‌లో (చివరి సారిగా 2022 సీజన్‌లో 3 మ్యాచ్‌లు ఆడాడు) అయితే అతడి పేరు కూడా చాలా మందికి గుర్తులేదు. 2022లో తన కెరీర్ అగమ్యగోచరంలో పడ్డ సమయంలో కరుణ్ చేసిన ట్వీట్.. క్రికెట్ అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. కానీ ఈ మూడేండ్లలో అతడి కెరీర్ మరో మలుపు తీసుకుంది. మూడేండ్ల కష్టానికి ఫలితమే ఆదివారం నాటి విధ్వంసం!

### దేశవాళీలో దుమ్మురేపి..

జాతీయ జట్టులో చోటు కోల్పోయినా.. రాష్ట్ర జట్టు వదిలేసినా కరుణ్ ఆత్మవిశ్వాసం కోల్పోలేదు. తనను ఆదరించిన దేశవాళీనే నమ్ముకున్నాడు. 2023–24 సీజన్ అతడికి ఎంతో ప్రత్యేకం. ఆ సీజన్ రంజీలలో 53.94 సగటుతో ఏకంగా 863 పరుగులు చేసి విదర్భ రంజీ చాంపియన్‌గా నిలవడంలో కీలకపాత్ర పోషించాడు. విజయ్ హజారే ట్రోఫీలో అయితే కరుణ్ విధ్వంసం తారాస్థాయికి చేరింది. 8 ఇన్నింగ్స్‌లలో 779 పరుగులతో దుమ్మురేపాడు. ఇందులో ఐదు శతకాలున్నాయి. ముస్తాక్ అలీ ట్రోఫీలో 255 రన్స్‌తో మెరిశాడు. నిలకడగా రాణిస్తున్న కరుణ్‌ను ఈ ఏడాది జూన్‌లో ఇంగ్లండ్‌తోనే జరుగబోయే టెస్టు సిరీస్‌లో కరుణ్‌ను పక్కనబెట్టలేని పరిస్థితి నెలకొన్నది.

# చెన్నై హమ్మయ్య!

## రాణించిన దూబే, ధోనీ
## ఉత్కంఠ పోరులో లక్నోపై గెలుపు
## రిషబ్ పంత్ ప్రదర్శన వృథా




లక్నో: ఐపీఎల్‌లో చెన్నై సూపర్‌కింగ్స్ వరుస ఓటములకు ఫుల్‌స్టాప్ పడింది. ప్లేఆఫ్స్ రేసులో నిలువాలంటే తప్పక గెలువాల్సిన మ్యాచ్‌లో సత్తాచాటింది. సోమవారం ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో చెన్నై 5 వికెట్ల తేడాతో లక్నో సూపర్‌జెయింట్స్‌పై విజయం సాధించింది. లక్నో నిర్దేశించిన 167 పరుగుల లక్ష్యాన్ని చెన్నై 5 వికెట్లు కోల్పోయి 19.3 ఓవర్లలో 168 స్కోరు చేసింది. శివమ్ దూబే(37 బంతుల్లో 43 నాటౌట్, 3 ఫోర్లు, 2సిక్స్‌లు), ధోనీ(11బంతుల్లో 26 నాటౌట్, 4ఫోర్లు, సిక్స్) జట్టు విజయంలో కీలకమయ్యారు. బిష్ణోయ్ (2/18) రెండు వికెట్లు తీశాడు. తొలుత టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన లక్నో.. 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 166 పరుగులకే పరిమితమైంది. రిషభ్ పంత్ (49 బంతుల్లో 63, 4 ఫోర్లు, 4 సిక్సర్లు) ఈ సీజన్‌తో తొలి అర్ధ సెంచరీతో రాణించగా మిచెల్ మార్ష్ (30) ఫర్వాలేదనిపించాడు. చెన్నై బౌలర్లలో జడేజా (2/24), పతిరాన (2/45) తలా రెండు వికెట్లు తీశారు. వికెట్లు పడకపోయినా నూర్ అహ్మద్.. 4 ఓవర్లలో 13 పరుగులే ఇచ్చి లక్నోను కట్టడి చేశాడు.

### చెన్నై పడుతూ లేస్తూ:

స్వల్ప ఛేదనలో లక్నో మాదిరిగానే చెన్నై కూడా తడబడింది. సీఎస్‌కేకు తొలి మ్యాచ్ ఆడిన ఆంధ్ర కుర్రాడు షేక్ రషీద్ (19 బంతుల్లో 27, 6 ఫోర్లు) సాధికారికంగా బ్యాటింగ్ చేశాడు. రచిన్‌తో కలిసి అతడు తొలి వికెట్‌కు 4.5 ఓవర్లలోనే 52 పరుగులు జతచేశాడు. ఈ సీజన్ పవర్ ప్లేలో ఫిఫ్టీ ప్లస్ స్కోరు చేయడం చెన్నైకి ఇది రెండోసారి మాత్రమే. అయితే అవేశ్ ఖాన్ రాకతో చెన్నై వికెట్ల పతనం మొదలైంది. అతడి 5వ ఓవర్లో రషీద్.. పూరన్‌కు క్యాచ్ ఇవ్వడంతో చెన్నై ఇన్నింగ్స్ తడబడింది. క్రీజులో కుదురుకున్న రచిన్.. మార్క్‌రమ్ బౌలింగ్‌లో ఎల్బీగా వెనుదిరిగాడు. బిష్ణోయ్ రంగప్రవేశంతో సీఎస్‌కే కష్టాలు రెట్టింపయ్యాయి. బిష్ణోయ్ 13వ ఓవర్‌లో జడేజా(7) పెవిలియన్ చేరగా, ఓవర్ తేడాతో దిగ్వేశ్ బౌలింగ్‌లో విజయ్ శంకర్(9) పెవిలియన్ చేరాడు. దీంతో 111 పరుగులకే చెన్నై 5 వికెట్లు కోల్పోయింది. ఈ దశలో శివమ్ దూబే, కెప్టెన్ ధోనీ..లక్నో బౌలర్లకు ఎదురొడ్డి నిలుస్తూ చెన్నైకి కీలక విజయాన్ని అందించారు.

### పంత్ ఆడినా..

స్పిన్నర్లకు సహకరించే ఏకనా పిచ్‌పై లక్నో ఇన్నింగ్స్ పడుతూ లేస్తూ సాగింది. టాపార్డర్ వైఫల్యంతో ఆ జట్టు ఈ సీజన్‌లో అత్యల్ప స్కోరు నమోదు చేసింది. బంతి దొరికితే స్టాండ్స్‌లోకి పంపిస్తూ పవర్ ప్లేలో వీరవిహారం చేసే బ్యాటింగ్ ద్వయం మిచెల్ మార్ష్, నికోలస్ పూరన్ (9 బంతుల్లో 8) సైతం చెన్నై బౌలర్ల ధాటికి నిలువలేకపోయారు. మొదటి ఓవర్‌లోనే ఖలీల్ (1/38).. మార్క్‌రమ్‌ను ఔట్ చేసి చెన్నైకి తొలి బ్రేక్‌నిచ్చాడు. భీకర ఫామ్‌లో ఉన్న పూరన్‌ను అన్షుల్.. 4వ ఓవర్లో వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. తొలి 6 ఓవర్లలో లక్నో స్కోరు 42/2 మాత్రమే. పూరన్ స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన పంత్.. ఓవర్టన్ బౌలింగ్‌లో సిక్సర్‌తో జట్టు స్కోరును 50 పరుగుల మార్కును దాటించాడు. క్రీజులో నిలదొక్కుకునేందుకు తంటాలు పడ్డ మార్ష్‌ను.. 10వ ఓవర్లో జడ్డూ క్లీన్‌బౌల్డ్ చేశాడు. ఓ బౌండరీ, రెండు సిక్సర్లతో ధాటిగా ఆడిన బదోని (22).. జడేజా బౌలింగ్‌లో ముందుకొచ్చి ఆడేందుకు యత్నించగా ధోనీ స్టంపౌట్‌తో అతడి ఇన్నింగ్స్ ముగిసింది. స్పిన్నర్ల రాకతో లక్నోకు పరుగుల రాక మందగించింది. ముఖ్యంగా నూర్ అహ్మద్ బౌలింగ్‌లో పంత్ తంటాలు పడ్డాడు. 39 బంతుల్లో 40 పరుగులు చేసిన పంత్.. ఆ తర్వాత పతిరాన బౌలింగ్‌లో గేర్ మార్చి 2 సిక్సర్లు బాది ఈ సీజన్‌లో తొలి అర్ధ శతకాన్ని నమోదుచేశాడు. ఆఖర్లో సమద్ (20) రెండు భారీ సిక్సర్లు కొట్టాడు. పతిరాన వేసిన ఆఖరి ఓవర్లో మూడు వికెట్లు పడటంతో లక్నో తక్కువ స్కోరుకే పరిమితమైంది.

**1** — **ఐపీఎల్‌లో అత్యధిక(201) ఔట్లలో భాగమైనవారిలో చెన్నై వికెట్‌కీపర్ ధోనీ అగ్రస్థానంలో ఉన్నాడు. కార్తీక్(182), డివిలీర్స్(126), ఉతప్ప(124) ఆ తర్వాత ఉన్నారు.**

### సంక్షిప్త స్కోర్లు

**లక్నో:** 20 ఓవర్లలో 166/7 (పంత్ 63, మార్ష్ 30, జడేజా 2/24, పతిరాన 2/45)
**చెన్నై:** 19.3 ఓవర్లలో 168/5(దూబే 43 నాటౌట్, రవీంద్ర 37, బిష్ణోయ్ 2/18, దిగ్వేశ్ 1/23)

### పాయింట్ల పట్టిక

| జ | మ్యా | గె | ఓ | పా | ర.రే |
|---|---|---|---|---|---|
| గుజరాత్ | 6 | 4 | 2 | 8 | 1.08 |
| ఢిల్లీ | 5 | 4 | 1 | 8 | 0.89 |
| బెంగళూరు | 6 | 4 | 2 | 8 | 0.67 |
| లక్నో | 7 | 4 | 3 | 8 | 0.08 |
| కోల్‌కతా | 6 | 3 | 3 | 6 | 0.80 |
| పంజాబ్ | 5 | 3 | 2 | 6 | 0.06 |
| ముంబై | 6 | 2 | 4 | 4 | 0.10 |
| రాజస్థాన్ | 6 | 2 | 4 | 4 | -0.83 |
| హైదరాబాద్ | 6 | 2 | 4 | 4 | -1.24 |
| చెన్నై | 7 | 2 | 5 | 4 | -1.27 |

నోట్: జ- జట్టు, మ్యా. మ్యాచ్, గె-గెలుపు, ఓ-ఓటమి, పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్

## మనిక, శ్రీజ శుభారంభం



మకావు (చైనా): ఇంటర్నేషనల్ టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్ (ఐటీటీఎఫ్) ప్రపంచకప్‌లో తొలి రోజు భారత ప్యాడ్లర్లు శుభారంభం చేశారు. తెలంగాణ అమ్మాయి శ్రీజ ఆకుల, మరో స్టార్ ప్లేయర్ మనిక బాత్రా తొలి రౌండ్ విఘ్నాన్ని విజయవంతంగా దాటారు. మహిళల సింగిల్స్‌లో శ్రీజ 3–1తో కాన్స్టంటిన (ఆస్ట్రేలియా)ను చిత్తు చేసింది. మరో పోరులో మనిక.. 4–0తో మేయ్లిస్ గిరెట్ (ఫ్రాన్స్)పై అలవోక విజయం సాధించి టోర్నీని విజయంతో ఆరంభించింది.

## రైజర్స్ ప్లేయర్లకు తప్పిన ప్రమాదం

### బస చేసిన హోటల్లో ఫైర్ యాక్సిడెంట్



హైదరాబాద్, ఆట ప్రతినిధి: సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్లేయర్లకు ప్రమాదం తప్పింది. రైజర్స్ ఆటగాళ్లు బస చేస్తున్న పార్క్ హయత్ హోటల్లో సోమవారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. దీంతో ఒక్కసారిగా హోటల్లో దట్టమైన పొగలు అలుముకున్నాయి. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది పరిస్థితిని అంచనా వేశారు. మంటలు అదుపులోకి రావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అయితే ప్రమాదానికి గల కారణమేంటో ఇంకా తెలియాల్సి ఉందని అధికారులు పేర్కొన్నారు. ఈనెల 17న ముంబై ఇండియన్స్‌తో మ్యాచ్ కోసం ప్రమాదం జరిగిన సమయంలోనే రైజర్స్ ప్లేయర్లు ఎయిర్‌పోర్ట్‌కు బయల్దేరి వెళ్లారు. దీంతో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరుగలేదని హోటల్ యాజమాన్యం పేర్కొంది.



## ధీరజ్‌కు కాంస్యం

ఫ్లోరిడా (అమెరికా): భారత యువ ఆర్చర్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బొమ్మదేవర ధీరజ్ ఫ్లోరిడాలో జరుగుతున్న ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్–1లో కాంస్యంతో మెరిశాడు. పురుషుల వ్యక్తిగత రికర్వ్ విభాగంలో ధీరజ్ 6–4 (28–28, 28–29, 29–29, 29–28, 30–29)తో ఆండ్రెస్ టెమినో(స్పెయిన్)ను ఓడించి పతకం గెలిచాడు. ఈ టోర్నీలో అతడికిది రెండో పతకం. ధీరజ్ ఇది వరకే పురుషుల రికర్వ్ టీమ్ ఈవెంట్‌లో రజతం గెలిచిన జట్టులో సభ్యుడిగా ఉన్నాడు.

## మయాంక్‌కు లైన్ క్లియర్



లక్నో: హ్యాట్రిక్ విజయాలతో ఫుల్ జోష్‌లో ఉన్న లక్నో సూపర్ జెయింట్స్‌కు మరో శుభవార్త. ఆ జట్టు యువ పేసర్ మయాంక్ యాదవ్.. జట్టుతో కలవనున్నాడు. గాయం కారణంగా చాలా కాలంగా ఎన్సీఏకే పరిమితమైన మయాంక్.. పూర్తి స్థాయిలో కోలుకోవడంతో బౌలింగ్ చేయడానికి బీసీసీఐ కూడా అనుమతినిచ్చింది. మయాంక్.. ఈనెల 19న జైపూర్‌లో రాజస్థాన్ రాయల్స్‌తో మ్యాచ్‌లో బరిలోకి దిగే అవకాశముంది.

### రుతురాజ్ స్థానంలో అయుశ్

గాయంతో ఐపీఎల్–18 నుంచి తప్పుకున్న చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) సారథి రుతురాజ్ గైక్వాడ్ స్థానాన్ని ముంబై బ్యాటర్ అయుశ్ మాత్రె భర్తీ చేయనున్నాడు.

## ఫెర్గూసన్ ఔట్

కోల్‌కతా: ఈ సీజన్‌లో అద్భుత ఆటతీరుతో దుమ్మురేపుతున్న పంజాబ్ కింగ్స్‌కు షాక్ తప్పేలా లేదు. ఆ జట్టు స్టార్ పేసర్ లాకీ ఫెర్గూసన్ ఈ టోర్నీ నుంచి నిష్క్రమించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. హైదరాబాద్‌తో మ్యాచ్ సందర్భంగా రెండు బంతులు వేసిన ఫెర్గూసన్.. ఎడమ కాలి గాయంతో మైదానాన్ని వీడాడు. కోల్‌కతాతో మ్యాచ్‌కు ముందు పంజాబ్ బౌలింగ్ కోచ్ జేమ్స్ హోప్స్ మాట్లాడుతూ.. 'ఈ సీజన్ చివరి వరకు కూడా ఫెర్గూసన్ అందుబాటులోకి వచ్చే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయి'




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.